క్లుప్తంగా

నేడు చెక్కుల పంపిణీ

భైంసాటౌన్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులకు ఉదయం 9 గంటలకు, పట్టణ లబ్ధిదారులకు ఉదయం 10.30 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న సీఐ శ్రీనివాస్

సారంగాపూర్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం నిర్మల్‌రూరల్ సీఐ శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఈనెలలో స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులు, వాటిపై పోలీసులు తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. అనంతరం రికార్డులు తనిఖీ చేసి ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డిని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం నూతన టెక్నాలజీ సహకారంతో పోగొట్టుకున్న ఫోన్లను బాధితులకు అప్పగించారు.

'ఆదర్శ'లో ప్రవేశాలకు గడువు పెంపు

కుంటాల: స్థానిక ఆదర్శ పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్‌లో ప్రవేశం పొందేందుకు దరఖాస్తు గడువు ఈనెల 30 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అభ్యర్థులకు అవగాహన

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌భవన్‌లో కరీంనగర్ వారి ద్రోణాచార్య డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇండియన్ ఆర్మీ, నేవీలో చేరాలనుకునే అభ్యర్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సంస్థ డైరెక్టర్ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ 20 మంది యువకులకు మెడికల్ టెస్టులు నిర్వహించి ఎంపికైన నలుగురికి ఉచిత ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఇంకుడుగుంత నిర్మాణం

కడెం: ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల పైకప్పుల నుంచి వృథాగా పోయే నీటిని ఒడిసి పట్టేందుకే (రేయిన్ రూఫ్ వాటర్) ఇంకుడుగుంతల నిర్మాణాలు చేపడుతున్నట్లు ఏపీవో జయదేవ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయం వద్ద ఇంకుడుగుంత నిర్మాణ పనులను ప్రారంభించారు. ఏపీఎం రాజారాం, సీసీలు స్వామి, నర్సయ్య, జ్యోతి ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

నిర్మల్‌టౌన్: కొత్తగూడెంలో జూన్ 4న నిర్వహించే సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభకు సంబంధించిన గోడపత్రికలను శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి విలాస్ మాట్లాడుతూ సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీజేపీ హటావో.. దేశ్ కో బచావో ఇంటింటికీ సీపీఐ మొదటి విడత కార్యక్రమం విజయవంతంగా ముగిసిందన్నారు. లక్ష మందితో నిర్వహించే సభకు జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా హాజరవుతారని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భూక్య రమేశ్, జాదవ్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన ఎరువులు కార్యాలయానికి

కడెం: మండలంలోని ఉప్పరిగూడెంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఎరువులను శుక్రవారం వ్యవసాయశాఖ కార్యాలయానికి తరలించినట్లు ఏవో సంధ్యారాణి పేర్కొన్నారు. ఈ విషయమై ఇటీవలే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకుంటామని చెప్పారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లింగన్న

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో శుక్రవారం శ్రీరాంపల్లి మల్లికార్జునరావు రచించిన 'నిప్పులాంటి నిజాలు'అనే పుస్తకాన్ని నిర్మల్ బాగ్ అధ్యక్షుడు ఎం.సీ లింగన్న ఆవిష్కరించారు. నైజాం ప్రభువు తెలంగాణ హిందువులను ఎన్ని ఇబ్బందులకు గురి చేశారో పుస్తకంలో పొందుపరిచారని వారు పేర్కొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు.!

- నిరుపయోగంగా ధోబీఘాట్లు
- ఇబ్బంది పడుతున్న రజకులు
- పలుచోట్ల శిథిలావస్థకు నిర్మాణాలు
- సౌకర్యాలు కల్పించాలని వేడుకోలు



ముధోల్‌లో నిరుపయోగంగా ధోబీఘాట్

ముధోల్: మండలంలోని వివిధ గ్రామాల్లో రజకుల సౌకర్యార్థం ప్రభుత్వం ధోబీఘాట్‌లను నిర్మించింది. కాని వాటి నిర్వహణ గాలికొదిలేయడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. దీంతో బట్టలు ఉతికేందుకు రజకులు ఇబ్బంది పడుతున్నారు. ముధోల్ మండలంలో 19 గ్రామపంచాయతీలున్నాయి. ప్రభుత్వం కులవృత్తిదారులకు పెద్దపీట వేస్తూ.. గ్రామానికోక ధోబీఘాట్ నిర్మించింది. కానీ నీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో అవి వృథాగానే దర్శనమిస్తున్నాయి. దీంతో రజకులు చెరువుల్లో, కుంటల్లో మురికి నీటిలోనే బట్టలను శుభ్రం చేస్తున్నారు.

ధోబీఘాట్ పనిచేయని గ్రామాలివే..

మండలంలోని బ్రహ్మణ్‌గావ్, ఆష్టా, గన్నోర, విట్టోలి, చించాల, ముధోల్, రాంటెక్, తరోడ గ్రామాల్లో సౌకర్యాల్లేక ధోబీఘాట్లు పని చేయడం లేదు.

నాణ్యతా లోపంతో పగుళ్లు..

మండలంలోని ఎడ్‌బిడ్, ఆష్టా, మచ్కల్ తదితర గ్రామాల్లో ఊరికి దూరంగా నిర్మించిన ధోబీఘాట్లకు నీటి సౌకర్యం కల్పించకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. గ్రామాల్లో ఏడేళ్ల కిందట నిర్మించిన ధోబీఘాట్లకు బోరు మోటార్లు ఏర్పాటు చేసినా.. నీరు లేక నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఎడ్‌బిడ్‌లో ఆరేళ్ల కిందట నిర్మించిన ధోబీఘాట్ వద్ద బోరుబావి ఏర్పాటు చేసినా రెండేళ్లు మాత్రమే పని చేసిందని రజకులు పేర్కొంటున్నారు.

అధికారులు స్పందించాలి..

మండలకేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో సుమారు 80 రజక కుటుంబాలున్నాయి. ధోబీఘాట్ల ఏర్పాటుతో తమ సమస్యలు పరిష్కారం అవుతాయనుకుంటే.. నీటితోపాటు విద్యుత్ సౌకర్యం కల్పించలేదని రజక కులస్తులు వాపోతున్నారు. చెరువులో నీళ్లు లేక, బోరు బావికి నీరు పడక పగుళ్లు తేలి దోబీఘాట్ పనికి రాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కులవృత్తులు మానేసి కూలీ పనులకు వెళ్తున్నామని రజకులు పేర్కొంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి ధోబీఘాట్ల వద్ద సౌకర్యాలు కల్పించి ఉపయోగంలోకి తేవాలని రజకులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



చాలా గ్రామాల్లో ధోబీఘాట్ల వద్ద పగుళ్లు తేలి నీరు నిల్వ ఉండడం లేదు. దీంతో రజకులు బట్టలు ఉతకడం లేదు. పొలాల వద్దకు బట్టలను శుభ్రం చేస్తున్నారు. అధికారులు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించాలి.

– లింగన్న, తరోడా

కూలీ పనులకు వెళ్తున్నాం



ధోబీఘాట్‌లో నీళ్లు లేకపోవడంతో కులవృత్తి మానేసి కూలీ పనులకు వెళ్తున్నాం. ఇబ్బందిగా ఉన్నప్పటికీ పనులకు వెళ్లి పొట్ట నింపుకునేందుకు కూలీ పనులకు వెళ్లక తప్పడం లేదు. వెంటనే నీటితోపాటు విద్యుత్ సౌకర్యం కల్పించాలి.

– లక్ష్మణ్, ముధోల్

నిధులు రాగానే మరమ్మతులు చేయిస్తాం

పలు గ్రామాల్లో ధోబీఘాట్లు నీటి సౌకర్యం లేక పగుళ్లు తేలి నిరుపయోగంగా మారిన మాట వాస్తవమే. ఈ విషయమై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం. నిధులు మంజూరవగానే మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకొస్తాం.

– సురేశ్‌బాబు, ఎంపీడీవో

అటెన్షన్ ప్లీజ్ — మలుపు వద్ద సూచికలేవి?



కడెం: మండలంలోని ఎలగడప నుంచి పాతమద్దిపడగ గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో మూల మలుపు ప్రమాదకరంగా మారింది. దగ్గరకు వచ్చే వరకు మలుపు తెలియకపోవడంతో పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: మల్లారెడ్డి, డీఈ, ఆర్అండ్‌బీ, ఫోన్: 94906 51358

'ఉపాధి' పనులు వేగవంతం చేయాలి

- జెడ్పీ సీఈవో సుధీర్‌బాబు



మాట్లాడుతున్న సీఈవో సుధీర్‌బాబు

దస్తురాబాద్: ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలని జెడ్పీ సీఈవో సుధీర్‌బాబు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. వేసవి కాలం ముగుస్తున్నందున ఉపాధి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పలు రికార్డులు పరిశీలించి పలు వివరాలు తెలుసుకున్నారు. ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీవో అనిల్, ఏపీవో శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరం

భైంసాటౌన్:కంటివెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌బీఎస్‌కే మెడికల్ అధికారి డా మతీన్ అన్నారు. శుక్రవారం భైంసా పట్టణంలోని కిసాన్‌గల్లి మహాదేవ్ మందిర్ ఆవరణలో శిబిరం నిర్వహించి పలువురికి కంటి పరీక్షలు చేశారు. అనంతరం అవసరమైన వారికి కంటిఅద్దాలు అందించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సరిచేయాలి



మాట్లాడుతున్న ఈఆర్వో సురేశ్

కడెం: ఓటరు జాబితాలో తప్పులను సరి చేయాలని ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి(ఉట్నూర్ ఆర్డీవో)కె.సురేశ్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఒకే ఇంట్లో ఆరుగురి కంటే ఎక్కువ ఓటర్లు కలిగిన ఇంటి నంబర్లు గుర్తించి సరి చేయాలన్నారు. కడెం, జన్నారం, ఖానాపూర్, దస్తురాబాద్, పెంబి తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

ఒక్కరే హాజరు..

నాలుగు మండలాల నుంచి వివిధ రాజకీయ పార్టీల నాయకులు సమావేశానికి హాజరు కావాలి. కానీ మండలం నుంచి బీఎస్పీ నాయకుడు ఒక్కరే హాజరయ్యాడు.

నర్సాపూర్(జి): ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఇన్‌చార్జి తహసీల్దార్ సుమతి సూచించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, ఓటరు నమోదు ప్రక్రియపై బీఎల్‌ఓలకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలోఅవగాహన కల్పించారు. ఒకే కుటుంబంలో ఆరుగురు ఓటర్లు ఉంటే ఇంటినెంబర్‌ను విభజించి నూతన నెంబర్ నమోదు చేయడం, మృతి చెందిన వారితోపాటు వలస వెళ్లిన వారి పేర్లను విచారణ చేపట్టి తొలగించడంపై అవగాహన కల్పించారు. ఆర్ఐ వేణుగోపాల్, అడేల్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో రోగనిరోధక శక్తి



జోహర్‌పూర్‌లో పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ మీనా



ఖానాపూర్: బాలామృతం అందిస్తున్న నిర్మల

కుంటాల: చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా రోగనిరోధక శక్తి పెంపొందుతుందని ప్రత్యేకాధికారి మసార్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అందకూర్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలను ప్రదర్శించి గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి కిషన్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీటీసీ మధుకర్, ఐసీడీఎస్ సీడీపీవో నాగలక్ష్మి, సూపర్‌వైజర్ లక్ష్మీవిశారద, ఏపీవో గట్టుపల్లి నవీన్, ఏపీఎం భోజన్న, రిలయన్స్ సంస్థ కోఆర్డినేటర్ సుధాకర్, అంగన్‌వాడీ టీచర్లు విమల, జ్యోతి, ఏఎన్ఎం సక్కుబాయి పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని జోహర్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిరుధాన్యాల వంటకాల తయారీపై అంగన్‌వాడీ టీచర్లకు పోటీలు నిర్వహించారు. కొర్రల ఉక్మా తయారు చేసిన అబ్దుల్లాపూర్ అంగన్‌వాడీ టీచర్ సరస్వతికి ప్రథమ బహుమతి, రాగుల ఇడ్లీ తయారు చేసిన రాయపూర్ కాండ్లీ అంగన్‌వాడీ టీచర్ నర్సవ్వకు ద్వితీయ బహుమతి అందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మీనా, దిగంబర్, భోజన్న, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఖానాపూర్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఎదుగుదల కోసం ప్రభుత్వం బాలామృతం ప్లస్ పంపిణీ చేస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల అన్నారు. పట్టణంలోని బర్కత్‌పుర అంగన్వాడీ కేంద్రంలో పలువురు చిన్నారుల తల్లిదండ్రులకు బాలామృతం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తక్కువ ఎత్తు, బరువు ఉన్న పిల్లల తల్లిదండ్రులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే ఓనర్లపై కేసులు

- నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: వాహనదారులు తప్పనిసరిగా అన్ని ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని.. మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. పట్టణ ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆటోలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 50 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో కొందరు ట్రాఫిక్ చలాన్లు తప్పించుకునేందుకు, నెంబర్‌ప్లేట్ పెట్టుకోవడం లేదన్నారు. నంబర్‌ప్లేట్‌ను విరగొట్టినా.. తప్పుగా రాసినా ఫోర్జరీ, చీటింగ్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఆటో ఓనర్లు తమ వాహనాలను అద్దెకు ఇచ్చేటప్పుడు వారికి డ్రైవింగ్ లైసెన్స్ ఉందో లేదో చూసుకోవాలన్నారు. రాంగ్ రూట్లో వెళ్లేవారితోపాటు సిగ్నల్ జంపు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పట్టణ సీఐ మల్లేశ్, ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, పలువురు సిబ్బంది ఉన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి ఫిర్దోస్ జబీన్



ముజ్గి పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డాక్టర్ సౌమ్య

భైంసాటౌన్:గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని భైంసా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఫిర్దోస్ జబీన్ అన్నారు. శనివారం ఈ మేరకు గర్భిణులకు ఆస్పత్రిలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు మూడునెలల నుంచి తొమ్మిది నెలల వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలపై అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే డెలివరీ చేయించుకోవాలని సూచించారు. హెచ్ఈవో కలీమోద్దీన్, ఏఎన్ఎంలు ఉన్నారు.

నిర్మల్‌రూరల్: పోషకాహారం తీసుకోవడం ద్వారా గర్భిణుల్లో వచ్చే రక్తహీనత సమస్యను నివారించవచ్చని వైద్యురాలు సౌమ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని ముజ్గి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'అనీమియా ముక్త్ 'కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణులకు అనీమియాతో వచ్చే సమస్యలు, నివారణపై అవగాహన కల్పించారు. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలను వివరించారు. సూపర్‌వైజర్ మాధురి, స్టాఫ్‌నర్సులు స్వర్ణ, బిందు, సుష్మ, ఏఎన్ఎంలు సుమతి, శారద, కళా, శోభారాణి, కౌసల్య, జమున పాల్గొన్నారు.

28 నుంచి పట్టాభిషేక వారోత్సవాలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఈనెల 28 నుంచి జూన్ 3 వరకు ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేక వారోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్మల్ జిల్లా శివాజీ ఉత్సవ సమితి, హిందువాహిని నాయకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 28న స్థానిక ఉమామహేశ్వర ఆలయంలో ఆధ్యాత్మికత పురోహితుల ఆత్మీయ సమ్మేళనం , 29న విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో మేధావులు, విశ్రాంత ఉద్యోగుల సమ్మేళనం, 30న భాగులవాడ శిశుమందిర్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం, మారుతి ఇన్‌లో వివిధ రంగాల్లో వ్యాపార ప్రముఖుల సమ్మేళనం , 31న ఉమామహేశ్వర ఆలయంలో అన్ని కుల సంఘాలతో సమ్మేళనం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జూన్ 1న ఉమామహేశ్వర ఆలయంలో మహిళామూర్తుల సమ్మేళనం, 2న అన్ని గ్రామాల్లో సమ్మేళనం, 3న స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నుంచి శివాజీ చౌక్ వరకు బైక్ ర్యాలీ ఉంటుందని వారు తెలిపారు.

నిర్లక్ష్యానికి .. గోమాత బలి



మృతి చెందిన ఆవు

కడెం: మండలంలోని దోస్త్‌నగర్ గ్రామ సమీపంలో సెల్ టవర్ కోసం తవ్వి వదిలేసిన గుంతలో పడి గ్రామానికే చెందిన బియ్యాల శంకరయ్య ఆవు మృతి చెందింది. నిర్లక్ష్యంగా పనులు చేయిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు డిమాండ్ చేశారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి

ముధోల్: ఎండల నేపథ్యంలో నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా చూసుకోవాలని ప్రత్యేకాధికారి సుదర్శన్ అన్నారు. శుక్రవారం మండలంలోని విఠోలి, విఠోలితండా గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. మొక్కలకు రెండు పూటల నీళ్లు అందించడంతోపాటు పిచ్చిమొక్కలను తొలగించాలన్నారు. ఎంపీడీవో సురేశ్‌బాబు, ఏపీవో శిరీష, కార్యదర్శులు ఉన్నారు.

'పల్లెప్రగతిపై నిర్లక్ష్యం సరికాదు'

కుంటాల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లెప్రగతిపై నిర్లక్ష్యం తగదని ప్రత్యేకాధికారి మసార్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పెంచికల్‌పాడ్, విఠాపూర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రం, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించారు. రాబోయే వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సారిక, కవిత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



ఖానాపూర్: మండలంలోని దిలావార్‌పూర్ శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయ ప్రథమ వార్షిక ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం అవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 27న ఇంటింటా జోగు, పట్నాలు, 28న పోచమ్మకు సదరు బోనాలు, 29న గంగస్నానాలు, పట్టుధని, భక్తులతో లందకాడికి వెళ్లడం, 30న ఎల్లమ్మకు సదరు బోనాల ఊరేగింపు, అన్నదానం, అమ్మవారి దివ్యదర్శనం, జాతర ఉంటుందన్నారు. ఆదివారం నుంచి మంగళవారం వరకు రాత్రి ఒగ్గు కథ ఉంటుందని భక్తులు తరలిరావాలని కోరారు.

కూల్చివేత అన్యాయం

కుంటాల: స్థానిక ప్రజాప్రతినిధులు పట్టుబట్టి అధికారుల చేత పేద ప్రజల ఇళ్ల నిర్మాణాలు కూల్చివేయడం అన్యాయమని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి అన్నారు. శుక్రవారం కుంటాలలో శిలారీ గణేశ్‌కు చెందిన కూల్చివేసిన ప్రహరీ పరిశీలించి వారు మాట్లాడారు. వారి వెంట జిల్లా ఉపాధ్యక్షులు భూషణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, తాటి శివ, కొండన్నగారి రమణారావు, రాధాకృష్ణ, మధుసూదన్‌రావు, నారాయణ తదితరులు ఉన్నారు.

పరామర్శ

నిర్మల్‌ఖిల్లా: ఇటీవల బెయిల్‌పై విడుదలైన వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు సంపంగి ప్రభాకర్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి శుక్రవారం జిల్లా కేంద్రంలో పరామర్శించారు. గత నెలలో ఇరు కుటుంబాల మధ్య జరిగిన ఓ వివాదంలో మధ్యవర్తిగా వ్యవహరించిన ప్రభాకర్‌ను అకారణంగా కేసు నమోదు చేసి అరెస్టు చేశారన్నారు. వారి వెంట బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్ రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, వడ్డెర సంఘం నాయకులు శ్రీనివాస్, సాయిలు, గణేశ్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యేను కలిసిన కాలనీవాసులు

కుంటాల: మండలంలోని కల్లూర్ కొత్తకాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని కాలనీవాసులు దేగాంలోని ఆయన నివాసంలో కలిశారు. తాగునీటి వసతి, రోడ్డు వసతి లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. గృహలక్ష్మీ పథకం కింద తమను లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని వారు కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు కాలనీవాసులు పేర్కొన్నారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాత్రి, చిన్నారెడ్డి, బీఆర్ఎస్ సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి దశరథ్, పురుషోత్తం, చౌహాన్ రాజు, శోభన్, పీరాజీ తదితరులు ఉన్నారు.

వీవోఏల సమ్మె

ముధోల్: తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలో వీవోఏలు నిర్వహిస్తున్న సమ్మె శుక్రవారం 38వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు.